













# చలువ పందిళ్లు!

ఎంత అందంగా కట్టుకున్నా, ఎంత విశాలంగా ఉన్నా.. ఎప్పుడూ ఇంట్లోనే ఉండలేం. కాస్త బయటి గాలి పీల్చాలనే కోరికపుడుతుంది. ఆకాశం కింద సేద తీరాలనిపిస్తుంది. పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ వేడి వేడిగా చాయ్ తాగాలనో, సందడి సందడిగా పార్టీ చేసుకోవాలనో ఉంటుంది. ఆ చిన్నిచిన్ని ఆశలు నెరవేర్చుకోడానికి లక్షలకు లక్షలు ఖర్చు పెట్టలేం. అలా అని, మనసులోని కోరికను చంపుకోనూలేం. మధ్యేమార్గంగా 'గజీబో'లను ఏర్పాటు చేసుకోవచ్చు. డాబా మీద, పెరట్లో, ఫామ్‌హౌస్‌లో.. ఎక్కడైనా అతికినట్టు సరిపోతాయివి. ఎండావానల ఇబ్బంది లేకుండా.. ఓ పదిమంది కూర్చుని కబుర్లు చెప్పుకోవచ్చు. పుట్టినరోజు వేడుకలు, బర్త్‌డే పార్టీలు జరుపుకోవచ్చు. ఆహారానిదేముంది? వండుకోవచ్చు. వండించుకోవచ్చు. ఆర్డర్ చేయొచ్చు. ఇక డిజైన్ విషయానికొస్తే.. రాజస్థానీ స్టైల్ నుంచి వెస్ట్రన్ ఆర్కిటెక్చర్ వరకు, ట్రైబల్ డిజైన్ నుంచి టెంపుల్ ఆర్ట్ వరకు రకరకాల శైలులను ఎంచుకోవచ్చు. పునాదులు, గోడలతో పని లేకుండా.. విడి భాగాలను తీసుకొచ్చి బిగించుకోవచ్చు. అల్యూమినియం, కలప, సింథటిక్ మెటీరియల్.. అభిరుచిని బట్టి ఏదైనా ఎంచుకోవచ్చు. కాస్తంత తేడాతో 'పర్గోలా'లు కూడా ఇలాంటి వెసులుబాటునే కల్పిస్తాయి. గజీబోలతో పోలిస్తే ఇవి చిన్నగా ఉంటాయి. నలుగురైదుగురు సేద తీరడానికే పనికొస్తాయి. రూఫ్ ఓపెన్‌గా ఉంటుంది. మరీ ఎక్కువ వర్షాలు, ధారాళమైన ఎండలు లేని ప్రాంతాలకు ఇవి అనువైనవి. బడ్జెట్ తక్కువే. వీటివల్ల ఆవరణ అందం రెట్టింపు అవుతుంది. సరికొత్త రీవి తోడవుతుంది. రెండిటికీ తగినంత నిర్వహణ అవసరమే!













